

ఏకలవ్యలో 21 నుంచి ఆరో తరగతి ప్రవేశాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలో అనసభద్ర ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలు ఈనెల 21 నుండి ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపల్ బి ఎర్రునాయుడు తెలిపారు. గతంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు పాల్గొన్న విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ఆయా పాఠశాలలకు జాబితాలు వచ్చాయన్నారు. అర్హులైన విద్యార్థుల ఫోన్‌కు ఎస్ఎంఎస్‌లు కూడా పంపించామన్నారు. తగిన ధ్రువపత్రాలు పట్టుకుని పాఠశాలను సంప్రదించాలని ఆయన అన్నారు.

కనీస వేతనం ఇవ్వాలని... ఉద్యోగ భద్రత కల్పించాలని

కదం తొక్కిన ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి, మేట్లకు పారితోషకం చెల్లించాలి, బకాయి ఉన్న 12 వారాల ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలని, ఒక్క పూట ఉపాధి పనులు పెట్టాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, వేతనదారులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, ఉపాధ్యక్షులు వి.ఇందిర, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా కార్యదర్శి మండంగి హరినాథ్ తదితరులు మాట్లాడారు. గత 20ఏళ్లుగా ఉపాధి హామీ చట్టాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల పట్ల రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ మేట్లకు పారితోషకం ఇస్తామని చెప్పి నేటికీ చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, కనీసం కూలీల వివరాల నమోదు చేసేందుకు ఫోన్లు కూడా ఇవ్వలేదని అన్నారు. గత 12 వారాలుగా ఉపాధి హామీ కూలీలకు జిల్లా వ్యాప్తంగా వేతనాలు చెల్లించట్లేదని దీనివల్ల వేతనదారులు పనులకు రావడంలేదని తెలిపారు. ఉపాధి కూలీలు పనులకు రాకపోవడానికి ఫీల్డ్ అసిస్టెంట్లను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఫీల్డ్‌అసిస్టెంట్లను తరచూ

భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా



పట్టణంలో భారీ ర్యాలీ చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, వేతనదారులు

డ్వామా ఆఫీస్‌కు రప్పించుకుని దోషులుగా చిత్రీకరించి ఆవేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌కు, డ్వామా పీడీ రామచంద్రరావుకు అందజేశారు.

కలెక్టర్, పీడీ హామీతో ఆందోళన విరమణ

ఆందోళన అనంతరం యూనియన్ ప్రతినిధులతో కలెక్టర్, డ్వామా పీడీ చర్చలు జరిపారు. నాయకులు తెలిపిన సమస్యలపై కలెక్టర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పందిస్తూ వారంలోగా బకాయి ఉన్న 12 వారాల వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపడతామని, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిది అయినందున రాష్ట్ర అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని, ఎలాంటి వేధింపులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఒక్క పూట ఉపాధి పని నిర్వహణకు, మేట్ల పారితోషకానికి సంబంధించి రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చలు జరిపి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్లు సమస్యల చర్చించేందుకు జాయింట్ మీటింగ్ నిర్వహిస్తామని, తన పరిధిలోని సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని పిడి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు వెంకటరమణ, ఆదినారాయణ, సంఘం నాయుడు, జోగమ్మ, సింహాచలం, రమణమ్మ, మోహన్ దాస్ ు పాల్గొన్నారు.

ఆందోళనకు సిపిఎం మద్దతు..

ఉపాధి హామీ సమస్యలపై ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు, మేట్లు నిర్వహించిన ఆందోళనకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ర్యాలీలో పాల్గొని కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ప్రసంగించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు 20 ఏళ్లుగా సేవ చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ప్రజలు ఉద్యమించాలని, అందులో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కూలీలు ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఈ ఆందోళనలకు సిపిఎం ఎల్లప్పుడు మద్దతు ఇస్తుందని తెలిపారు.

కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న సిఐటియు నాయకులు





అసలేం జరిగింది?

మంత్రి తనిఖీ తర్వాత భయం గుప్పెట్లో సిబ్బంది

కొంతమందిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువలస కస్తూరీ బాయి గాంధీ విద్యాలయంలో అసలేం జరిగిందని వరుసగా అధికారులు విచారణ చేపడుతున్నారనే చర్చ జరుగుతోంది. సుమారు 200మంది విద్యార్థినులు చదువుతున్న ఈ పాఠశాల లక్ష్యంగా జిల్లా అధికారులు నుంచి మండల అధికారుల వరకు ఎందుకు విచారణల మీద విచారణలు జరుపుతున్నారనేది అంతుచిక్కడం లేదు. కొద్దిరోజుల క్రితం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆకస్మికంగా ఈ పాఠశాలను తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ డిడి కృష్ణవేణితో సహా ఆమె పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు సరిగ్గా భోజనం పెట్టడం లేదని ఆమె తనిఖీల్లో గుర్తించారు. ఆరోజు అదే విషయాన్ని విలేకరులతోనూ చెప్పారు. మంత్రి తనిఖీలు పూర్తయిన వెంటనే అదే రోజు రాత్రి 12 గంటల వరకు సర్వశిక్షా అభియాన్ ఎపిసి, జిసిడిఒ విచారణ నిర్వహించారు. ఆ విచారణలో ఏం తేలిందో బయటికి చెప్పలేదు. పాఠశాలలో విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం స్పెషల్ ఆఫీసర్ జి.ప్రశాంతి వంట సరుకులను కుక్‌లకు అందజేస్తున్నారని విద్యార్థినుల విచారణ జరిపిన అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే రోజువారీ వంట సరుకుల్లో కొంతమేర పక్కదారి పడుతున్నాయని, అవి ఎవరు పక్కదారి పట్టిస్తున్నారనేది విద్యార్థినులు అధికారులకు చెప్పినట్లు తెలిసింది. వంట సరుకులను అక్రమంగా పక్కదారి పట్టిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా పాఠశాల ఎస్ఒ ప్రశాంతికి షోకాజ్ నోటీసు జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ఎస్ఒ ప్రశాంతి తప్పు లేకపోయినా ఆమెపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో గురువారం కూడా ఇద్దరు ఎంఇఒలు విచారణ నిర్వహించడం చర్చనీయాంశమైంది. అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకే వరుస విచారణలు నిర్వహించి ఎస్ఒ ప్రశాంతిని బాధ్యురాలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఎస్ఒ ప్రశాంతి తప్పు లేదని, ఆమెకు వ్యతిరేకంగా విద్యార్థినులు ఏమీ చెప్పలేదని జిల్లా అధికారులు మంత్రికి చెపుతున్నా ససేమిరా అంటూ ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌పి మాధవరెడ్డి

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం : ఎస్‌పి

వాలీబాల్ విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి- సీతంపేట

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి మాధవరెడ్డి అన్నారు. మండలంలో దోనుబాయి పోలీసులు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. దుగ్గి గ్రామానికి చెందిన వాలీబాల్ జట్టుకు మొదటి స్థానం లభించడంతో రూ.5వేలు సీల్డ్, దుస్తులు, నెట్, బాల్ అందజేశారు. రెండో బహుమతిగా పొల్ల కాలనీ జట్టుకు రూ. 3వేలు, ఫీల్డ్ దుస్తులు, నెట్, బాలు, మూడో బహుమతి పెద్ద పల్లంకి జట్టుకు రూ. 2వేలు క్రీడా దుస్తులు, నెట్, బాల్ ఎస్‌పి చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో యువత చెడు మార్గానికి వెళ్లకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీతంపేట, దోనుబాయి, సీతాపురంలో మెడికల్ క్యాంపు నిర్వహించామన్నారు. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడకుండా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉంటూ, నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్‌కోడ్ పెడుతున్నామని తద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. శక్తి యాప్ మహిళా పోలీసులు డౌన్లోడ్ చేయించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ చంద్రమౌళి, సీతంపేట, దోనుబాయి, వీర ఘట్టం, బత్తిలి ఎస్ఐలు అమ్మనరావు, షేక్ మస్తాన్, కళాధర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీ

ప్రజాశక్తి - పార్వతీపురం

పంచాయితీల్లో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు జరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమావేశ మందిరం నుంచి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఆర్డీఎస్ అధికారులతో స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్రా, డ్రై డే, వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో ఈ సారి "ఇ వేస్ట్" సేకరణ థీమ్ నిర్వహిస్తున్నందున యాక్షన్ ప్లాన్‌ను నోడల్ అధికారులకు అందజేయాలని అన్నారు. ఇ వేస్ట్ సేకరణలో భాగంగా అన్ని శాఖలలో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించి నిల్వగదిలో ఉంచాలని సూచించారు. పంచాయితీల్లో ఇంటింటికీ వెళ్లి చేకరించిన చెత్తను తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ వృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో నీటి వనరుల వృద్ధికి చెరువులు, బావులు, చెక్ డ్యామ్ లు, కాలువల అభివృద్ధికి గ్రామ సభలు నిర్వహించి పనులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాస క్షేత్రాల పెంపకం జిల్లాలో పది వేల ఎకరాల్లో సాగు లక్ష్యం కాగా, మండలంలో వేయి ఎకరాలు లక్ష్యంగా రైతులకు ప్రోత్సహించాలన్నారు. పాధి హామీ పథకం కాంపోనెంట్‌లో వ్యవసాయ పంటల మార్పిడి చేసి అయిల్ ఫామ్, ఉద్యాన పంటలైన మామిడి, జీడి, అంతర పంటగా సింహాచలం పైనాపిల్ సాగుకు ఊతం ఇవ్వాలని అన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్, ఎక్కువ విస్తీర్ణంలోని ప్రభుత్వ భూముల్లో మొక్కలను పెద్ద ఎత్తున నాటేందుకు ప్రాంతాలను గుర్తించాలన్నారు. శక్తి యాప్, మన మిత్ర యాప్‌లో ఏపి సేవలు అందుబాటులో ఉన్నాయో విస్తృతంగా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఆన్ లైన్ మోసాలు జరగకుండా సైబర్ సెక్యూరిటీ క్యూ ఆర్ కోడ్ ద్వారా చేయాలన్నారు.ఆధార్ అప్ డేట్ చేసుకొని చిన్నారులు 3,810 మంది వరకు ఉన్నారని తక్షణమే ఆధార్ నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్క పిల్లలకు అపార్ ఐ డీ తప్పని సరి అని పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్రా- స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయితీలకు కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లు మంజూరు చేయడం జరిగిందని ఎంతవరకు ప్రారంభ దశలో ఉన్నవి, గ్రౌండింగ్ ఎన్ని జరిగాయో విషయాలను నివేదిక అందజేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 15 వరకు యాంటీ లావా స్ప్రే కార్యక్రమం చేపట్టనున్నందున డ్రోన్, స్ప్రే యంత్రాల ద్వారా పిచికారీ చేసి మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. గ్రామాల్లో ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, డిఆర్ఒ కె.హేమలత, కె.ఆర్.సి.డిప్యూటీ కలక్టర్ ధర్మ చంద్రారెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకర్ రావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్.మన్మథ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం.సుధా రాణి, ముఖ్య జిల్లా ఉద్యాన వన అధికారి శ్యామల, జిల్లా పంచాయితీ అధికారి టి.కొండల రావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు 22 తుది గడువు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇటీవల మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన, ఇంప్రూవ్మెంట్ కోసం దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఇంటర్ బోర్డు పేర్కొన్న నిర్ణీత గడువులోగా ఫీజులు చెల్లించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి డి.మంజుల వీణ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 22లోగా ఫీజు చెల్లించేందుకు తుది గడువు అని, ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. ఇదే విషయాన్ని పలు యాజమాన్యాల ఆధ్వర్యంలో ఇంటర్ కోర్సులు నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. ఫీజుల వివరాలను ఆమె తెలియజేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.600 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. సబ్జెక్టుల వారీగా ఇంప్రూవ్మెంట్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.600తో పాటు అదనంగా ఒక్కో సబ్జెక్టుకు రూ.160 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విద్యార్థులు రూ.275 రూపాయలు, ఒకేషనల్ బ్రిడ్జ్ కోర్సులు హాజరయ్యే విద్యార్థులు రూ.165 చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్రిడ్జ్ కోర్స్ ప్రాక్టికల్స్‌కు రూ.275 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ పరీక్షా ఫలితాలకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలున్నా, రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకునే సదుపాయం ఇంటర్ బోర్డు కల్పించిందన్నారు. రీ కౌంటింగ్‌కు రూ.260, రీ వెరిఫికేషన్‌కు రూ.1300 చెల్లించాలన్నారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్సైట్ bie.ap.gov.in ద్వారా ఆన్లైన్లో ఈనెల 22లోగా ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను మే12న ప్రారంభం కానున్నట్లు డిఐఇఒ మంజుల వీణ తెలిపారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించిన పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరానికి సంబంధించిన పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 28నుంచి నుండి జూన్ 1 వరకు జరగనున్నాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నైతికత, మానవ విలువల పరీక్ష జూన్ 4న ఉదయం 10 గంటల నుండి 1:00 వరకు, పర్యావరణ విద్య పరీక్ష జూన్ 6 ఉదయం 10 నుంచి 1గంట వరకు నిర్వహించనునట్లు ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైన విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గరుగుబిల్లి పోలీస్ స్టేషనులో 2020లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ మహిళా కోర్ట్, విజయనగరం, స్పెషల్ జడ్జి ఎన్.పద్మావతి తీర్పు ప్రకటించినట్లు ఎస్పీ ఎస్ వి మాధవ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాల్లోకి వెళ్తే... గరుగుబిల్లి మండలం దళాయివలసకు బలగ లలిత జీవనోపాధి నిమిత్తం 2017లో ఆకివీడులోని రొయ్యల పరిశ్రమలో పనిచేస్తూ, కంపెనీ హాస్టల్‌లో ఉంటూ జీవనం సాగిస్తుంది. అదే ఏడాది కొంకడివరం గ్రామానికి చెందిన బలగ శివ వ్యవసాయ పనులు నిమిత్తం ఆకివీడు వెళ్లాడు. అక్కడ వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమించుకున్నారు. 2019లో శివను పెళ్లి చేసుకోమని లలిత కోరగా అందుకు శివ నిరాకరించాడు. వారి బంధువులు నచ్చజెప్పాగా పెళ్లి చేసుకుంటానని తన స్వగ్రామమైన కొంకడివరం తీసుకొచ్చి సుమారు 45 రోజులు అతడి ఇంట్లో వుంచి పెళ్లి చేసుకుంటానని మోసపూరిత హమీలిచ్చాడు. అనంతరం మళ్లీ పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు గరుగుబిల్లి అప్పటి ఎస్సై సింహాచలం నమోదు చేసారు. అనంతరం అప్పటి పార్వతీపురం రూరల్ సర్కిల్ సిఐ లక్ష్మణరావు ఈ కేసును దర్యాప్తు చేసి, శివను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో తగిన సాక్ష్యాధారాలతో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషను పూర్తయ్యే విధంగా చినమేరంగి సిఐ ఆధ్వర్యంలో గరుగుబిల్లి పోలీసు చర్యలు చేపట్టగా, విచారణలో శివపై నేరారోపణలు రుజువైంది. దీంతో శివకు పదేళ్ల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ మహిళా కోర్ట్, విజయనగరం, స్పెషల్ జడ్జి ఎన్.పద్మావతి గురువారం తీర్పు వెల్లడించారని తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యేలా పోలీసుల తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎన్.శకుంతల వాదనలు వినిపించగా, చినమేరంగి సర్కిల్ సిఐ తిరుపతిరావు పర్యవేక్షణలో గరుగుబిల్లి ఎస్ఐ రమేష్ నాయుడు, కోర్టు హెచ్‌సి బాబ్జీ, కోర్ట్ మోనటరింగ్ హెచ్‌సి ఎస్‌పి రాజు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పర్చారన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడేలా పోలీసుల తరుపున వాదనలు వినిపించిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎన్.శకుంతల, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ లక్ష్మణరావు, అప్పటి ఎస్సై సింహాచలం, సిఐ టివి తిరుపతిరావు, ప్రస్తుత గరుగుబిల్లి ఎస్ఐ పి.రమేష్ నాయుడు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

నిర్లక్ష్యం వీడకుంటే పోరాటమే

మూడోరోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సాలూరురూరల్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీ, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పనిచేసే మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో పోరాటాన్ని చవిచూడాల్సి ఉంటుందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా మూడో రోజు నిరసన కార్యక్రమం గురువారం జరిగింది. అనంతరం పారిశుధ్య విభాగం అధికారికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి టి.శంకర్ సాలూరు కమిటీ అధ్యక్షులు టి.రాముడు మాట్లాడారు. పట్టణంలో చనిపోయిన వారి కుటుంబాలకు నేటికీ ఉద్యోగాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం చెల్లించాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించడం లేదని, 62 ఏళ్లకు వయస్సు పెంచాల్సి ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని తెలిపారు. సాలూరులో మేలో శ్యామలాంబ పండగ దృష్ట్యా ఇతర పట్టణాల నుంచి కార్మికులను డిప్యూటేషన్‌పై పండుగలో వేసి స్థానిక కార్మికులకు పండగ సెలవులు ఇవ్వాలని అన్నారు. పండగను దృష్టిలో పెట్టుకొని అదనపు కార్మికులు వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం సమయంలో అధికారులతో చర్చల సందర్భంగా కుదుర్చుకున్న నిర్ణయాలకు జీవోలు విడుదల చేయాలని, ప్రభుత్వం ఆ విధంగా స్పందించకపోవడం అన్యాయమని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని లేకపోతే భవిష్యత్తులో జరిగే ఆందోళన పోరాటాలకు రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్మినెంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు, భోగిసు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకన్న, లక్ష్మి, పోలరాజు, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కురుపాం


విజేతలకు బహుమతులు అందిస్తున్న విరేష్

విద్యతో పాటు క్రీడల్లో యువత రాణించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. కురుపాంలో గత నెల రోజులుగా జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నీ గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముఖ్యఅతిథి పాల్గొని మొదటి బహుమతి గెలుపొందిన కురుపాం టీముకు రూ.40వేలు ట్రోఫీ, ద్వితీయ బహుమతి పొందిన కొండవాడ టీముకు రూ.20వేలు, ట్రోఫీ, తృతీయ బహుమతి పొందిన లిక్కిడి టీంకు 10వేలు, ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు అంధవరపు, కోటేశ్వరరావు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

మక్కువలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి- మక్కువ

మండల కేంద్రమైన మక్కువ పరిధిలోని సువర్ణముఖి నది వంతెన వద్ద వాహన తనిఖీలను పోలీసులు గురువారం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని, సరైన ధ్రువపత్రాలు లేని వారిపై అపరాధ రుసుములు వేశారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండడం కాకుండా హెల్మెట్ ధరించి నడవాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న ఎస్సైలు నాగరాజు, గోపీ, ఎఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

సమాఖ్యల ఆదాయం పెంచాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రామ, మండల సమాఖ్య ఆదాయం పెంచాలని వెలుగు ఎపిడి వై.సత్యంనాయుడు సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు సొంత నిధులు సిఐఎఫ్, విజిఆర్‌ఎఫ్ నిధులు అప్పులు ఇచ్చి మండల సమాఖ్య ఆదాయం పెంచాలని కోరారు. సభ్యులు తీసుకొన్న అప్పులు తప్పనిసరిగా జీవనోపాధి కోసం మాత్రమే వినియోగించేలా అవగాహన కల్పించాలని కోరారు, మండలంలో విడివికె సభ్యులకు శిక్షణ ఇచ్చి యాక్టివిటీ జరిగేలా అవగాహన కల్పించాలని కోరారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రభుత్వ పాఠశాలలోనే బడి ఈడు పిల్లలను చేర్పించాలని యుటిఎఫ్ పిలుపుమేరకు మండలంలోని గడగమ్మ, దశమంతపురం, మామిడిమాను గోర కాలనీ, తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు కరపత్రాలతో ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే పిల్లలను ప్రభుత్వ పాఠశాలను చేర్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.పైడ్రాజు, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, ఎన్.మానస, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో శుక్రవారం సబ్ స్టేషన్ పరిధిలో 33/11కెవిలో మరమ్మతు పనుల్లో భాగంగా మండలం విద్యుత్ అంతరాయం కలుపుతుందని ఇఇ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 2గంటల వరకు అంతరాయం కలుగుతుంది అన్నారు.

సాలూరు: రానున్న శ్యామలాంబ పండగ నేపథ్యంలో చేపట్టనున్న అత్యవసర పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరాకి ఆటంకం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ గోపాలరావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలు ఐసిడిఎస్ అధికారులు నిర్వహించారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణ కుమారి, పెదగుడబ ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి ఆధ్వర్యంలో గర్భిణులకు గాజులు, జాకెట్టు ముక్కలు, పండ్లు, స్వీట్లు అందజేశారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త ఎం.సావిత్రి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పోషకాహారలోపం, రక్తహీనతతో బాధపడకుండా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన బలవర్ధకమైన పోషకాహారం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సిహెచ్‌ఒలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు తక్షణమే చెల్లించాలని, సిహెచ్‌ఒలు గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. సిహెచ్‌ఒలకు కడుపు కోత కొయ్యవద్దని, అద్దె భవనాల బకాయిలు చెల్లించాలని, రెగ్యులర్ చేయాలని, నెలవారి జీతం బేసిక్ అమలు చేయాలని, తదితర అంశాలపై నిరసన చేపట్టారు.

21న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 21న మోడల్ స్కూల్ 2025 -26 సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష కోసం 240 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అధికారిక వెబ్ సైట్ apms.apcfss.in ద్వారా హాల్ టిక్కెట్ ను డౌన్లోడ్ చేసుకోని పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలని అన్నారు. పరీక్ష 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. మిరిన్ని వివరాలకు 9290452055, 76748 58698 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం


కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపిడిఒ

మండలంలోని నిడగల్లు, చెల్లమ్మనాయుడు వలసలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేస్తే వేతనాలు వస్తాయన్నారు. కనీస వేతనం కోసం ప్రతి వేతనదారుడు నిర్ణీత సమయాల్లో పనులు చేయాలన్నారు. ఫారం పాండ్స్ పనులు చేయాలన్నారు. జాబు కార్డు ప్రతి వేతనదారులకు పని కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

పెద్దూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరు గిరిజన గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశాలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిఎం మొండివైఖరి వీడాలి

◆ఎస్‌డబ్ల్యుఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ ◆ కార్మికులపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి : సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

ప్రజాశక్తి - పార్వతీపురం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

స్థానిక ఆర్‌టిసి డిపో మేనేజర్ తీరు మారాలని, కార్మికుల పట్ల కక్షపూరితమైన చర్యలు విడనాడాలని, సిఐటియు, వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఎఎస్‌టి బాబుపై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిహెచ్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పిఎన్‌వి రావు, విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకట్రావు, చంద్రయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు మాట్లాడుతూ డిపో మేనేజర్ కార్మికులను 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్, బదిలీ చేస్తున్నారని, ఇది చాలా అక్రమమైన చర్యని అన్నారు. ఎఎస్‌టి బాబు గతం నుంచి డిపోలో జరుగుతున్న అనేక అక్రమాలకు అడ్డుపడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను వ్యతిరేకిస్తుండడంతో ఒడి కండక్టర్ జెఎం రావుతో తప్పుడు ఫిర్యాదు రాయించుకొని దాని ఆధారంగా బాబును సస్పెండ్ చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఈ అన్యాయమైన చర్యను సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ పట్ల డిపో మేనేజర్ కక్షపూరితమైన చర్య చేపట్టియున్నారని, దీన్ని మానుకోవాలని సూచించారు. కార్మికులు విధి నిర్వహణలో తప్పుడు కార్యక్రమాలు చేపడితే క్రమ పద్ధతిలో చర్యలు తీసుకోవాలని, అటువంటి చర్యలు చేపట్టకుండా బాబుపై సస్పెన్షన్ విధించడమంటే, ఇది కేవలం కుట్రపూరిత చర్యనని, సస్పెన్షన్ రద్దు చేసి విధుల్లో తీసుకునేంత వరకు ఉద్యమం కొనసాగించాలని, ఈ పోరాటంలో సిఐటియు వెన్నుదన్నుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పిఎన్‌వి పరమేశ్వరరావు మాట్లాడుతూ పార్వతీపురం డిపో పరిధిలోని కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కృషి చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి ఎఎస్‌టి బాబుపై డిపో మేనేజర్ వ్యవహరిస్తున్న వైఖరి సరైంది కాదని, ఇది చాలా నీచమైన చర్యని వాపోయారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పార్వతీపురం డిపోలో 12 మంది కండక్టర్లను, డ్రైవర్లను డిపో యాజమన్యం సస్పెండ్ చేసిందని, ఇది చాలా అన్యాయమని అన్నారు.

ఎంటిడబ్ల్యు చట్టప్రకారం సిబ్బంది డ్యూటీ బుకింగ్ చార్టు 281 కార్మికులకు అందుబాటులో లేకపోవడాన్ని బాబు నిరంతరం ప్రశ్నిస్తుండడంతో ఒక రోజు ఇరువురి కార్మికుల మధ్య ఏర్పడిన చిన్నపాటి ఘర్షణను ఆసరాగా తీసుకొని ఎటువంటి సమన్వయం, కనీస ప్రమాణాలు పాటించకుండా సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్యని, వెంటనే సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు పి.రాజశేఖర్ మాట్లాడుతూ అక్రమంగా చేపట్టిన సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, భవిష్యత్ పోరాటాల్లో పూర్తి స్థాయి మద్దతు ఉంటుందని అన్నారు.

తాగునీటి కొరత ఉండరాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

తాగునీటి కొరత ఎక్కడా తలెత్తరాదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, ఇసుక, ప్రజల స్పందన, ఎంఎస్ ఎంఇ సర్వే, స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్రా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అంశంపై రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రతి రోజూ తాగునీటి అంశాలపై దృష్టి సారించి ఎక్కడా సమస్య తలెత్తినా తక్షణం చర్యలు తీసుకోవాలని, నిధులకు కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా పశువుల తాగునీటిపైనా శ్రద్ధ వహించాలన్నారు. పిఎం సూర్య ఘర్ కింద సౌర విద్యుత్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు ముందుకొస్తే ఏడాదికి ఎకరాకు రూ.31 వేలను అద్దెగా చెల్లిస్తామని చెప్పారు. వర్షాకాలం అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఇసుక నిల్వలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఇసుక రవాణాపై గట్టి నిఘా పెట్టాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా వంటి కనీస సదుపాయాలపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. మన మిత్ర, శక్తి యాప్‌లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. ఎంఎస్‌ఎంఇ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు.

మూడో శనివారం స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్రా

మూడో శనివారం స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం నిర్వహించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. "ఇ వేస్ట్ రీసైక్లింగ్" థీమ్‌తో ఈ నెల కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జెసి ఎస్ ఎస్ శోభిక, డిఆర్ఒ కె.హేమలత, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ టి.తమర్భ కొండలరావు, సిపిఒ పి.వీర్రాజు, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ జిల్లా పరిశ్రమల అధికారి పి సీతారాము తదితరులు పాల్గొన్నారు.

పెదబోగిలిలో గ్రామసభ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పెదబోగిలి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జె.తేరేజమ్మ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి పనులు పైన సమీక్షించారు. వివిద అంశాలపైన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ప్రధానంగా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో వివిధ రకాల సేవలు ఆగుతున్నాయన్నారు. విద్యుత్ బిల్లులు కట్టేందుకు వెళ్ళ లేకపోతున్నామని విద్యుత్ శాఖ అధికారులు బిల్లు కలెక్టర్ రాకపోవడంతో మీసేవ కేంద్రాల ద్వారా కట్టడంతో ఐదు రూపాయల అదనంగా చెల్లించవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలతో పాటు పలు రకాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కేకే కుమార్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ అరవింద్ కుమార్, గ్రామ పెద్దలు ఎస్ హరి, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

26న కురుపాం మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 26న ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షత మండల పరిషత్ సర్వసభ సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలంలోని అధికారులంతా వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికతో సకాలంలో సమావేశంలో పాల్గొనాలన్నారు. అలాగే మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు పంచాయితీ పరిధిలో గల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తే పరిష్కారమైనవైతే వెంటనే పరిష్కరిస్తామని లేనిచో ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు.

భూఆక్రమణపై విచారణ చేపట్టాలి

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో దళిత గిరిజనుల భూములు ఆక్రమణకు గురయ్యాయని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి చిత్తశుద్ధి ఉంటే వాటిపై విచారణ జరిపించాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాచిపెంట మండలం మోసూరులో దళితుల భూములను దళితులే సాగు చేస్తున్నారని, ఒకవేళ ఆక్రమణకు గురైతే ఇరువర్గాలకు ముందుగా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. అలా నోటీసులు జారీ చేయకుండా కొంతమంది బిసిలను వెంటబెట్టుకొని అధికారులు సర్వే చేయడమేమిటని ప్రశ్నించారు. మోసూరులో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఎవరూ ఆక్రమించలేదన్నారు. ఆ స్థలం గతంలో దానమిచ్చిన యజమాని అమ్ముకున్నారని, రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాతనే సర్పంచ్ ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారులు ఒక దళిత ఎంఇఒను అనవసరంగా బాధ్యుడ్ని చేసి సస్పెండ్ చేశారని చెప్పారు. మంత్రి సంధ్యారాణి వాస్తవాలు తెలుసుకోకుండా అడ్డగోలుగా మాట్లాడడం సరికాదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైసిపి పట్టణ నాయకులు మొకర లక్ష్మణరావు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల తీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం


నిరసన తెలుపుతున్న గిరిజనులు

గిరిజనులు కొండల్లో పండినటు చింత పండు, కొండచీపుర్లు తదితర అటవీ ఫలసాయాలను అమ్ముకోవడానికి వస్తుంటే అటవీశాఖ అధికారులు గిరిజనులను అడ్డుకోవడం సమంజసం కాదని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివా సరావు అన్నారు. గురువారం కురుపాంలోని గల రావాడ జంక్షన్ వద్ద గిరిజనులతో కలిసి అటవీ శాఖ అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం కురు పాంలో జరిగిన వారపు సంతకు గిరిజన ప్రజలు వాహనాలతో చింతపండును తీసుకొస్తుంటే మార్గమ ధ్యలో అటవీ శాఖ అధికారులు అడ్డుకొని అమ్మడానికి వీల్లేదని గిరిజనులను వేధిస్తున్నారన్నారు. గిరిజన ప్రజలు కొండలను సాగు చేస్తూ పోడు వ్యవసాయం చేస్తున్నారని ఆ కొండల్లో పండిన అటవీ ఫలసాయాలను కూడా గిరిజనులకే హక్కు ఉంటుందని అన్నారు. అలాగే ఆ ఫలసాయాలను అమ్ముకోవడానికి వస్తుంటే అడ్డుకోవడం సమంజసం కాదని, కావున తక్షణమే అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేనిచో గిరిజనులందర్నీ కదిలించి పెద్ద ఎత్తున అటవీశాఖ కార్యాలయాల ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలలో పోషకాలు కీలకం

ప్రజాశక్తి - భామిని



మాట్లాడుతున్న సిడిపిఒ భవానీ

శారీరక, మానసిక ఎదుగుదల్లో కీలకమైన ప్రతి ఒక్కరికీ పోషకాలపై అవగాహన తప్పనిసరి అని సిడిపిఒ శాంతి భవాని అన్నారు. భామిని సెక్టార్‌లోని దిమ్మిడిజోలలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. విభిన్న ఆహార పదార్థాలు, వాటిలో లభించే పోషకాలపై అవగాహన కల్పించారు. పోషణ పక్వాడా కార్యక్రమం ఈ నెల 22 వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ సోబితా పట్నాయక్, సిబ్బంది వరలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని జి.గుమ్మడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమం సిడిపిఒ పి.రంగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోషణ్ పక్వాడ్ ప్రాముఖ్యత గురించి వివరించారు. పౌష్టికాహారం తల్లులకు, పిల్లలకు తప్పనిసరిగా అందాలన్నారు. పోషకాలు గురించి వివరించారు. పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

19న స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - సీతానగరం

ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛంద ఆంధ్రా- స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న ఈ కార్యక్రమం నిర్వహించాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ వీసీ అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలక్ట్రికల్స్ వేస్టేజ్‌పై అవగాహన కల్పించి గ్రామాల్లో ర్యాలీ నిర్వహించాలన్నారు. అలాగే దండోరాలు వేయించాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్గీకరణతో సమన్యాయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

కూటమి ప్రభుత్వ తీసుకువచ్చిన వర్గీకరణ ఆర్డినెన్స్ వల్ల ఎస్సీ కులాలకు సమన్యాయం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎస్సీ కులాల ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడిన చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాట నిలబెట్టుకోవడమే కాకుండా ఎస్సీ కులాల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటారని ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో విద్య, ఉద్యోగ సమాన అవకాశాలకు మార్గం సుగమమైందన్నారు. చంద్రబాబు చిత్తశుద్ధితోనే వర్గీకరణ సాధ్యమైందని మాల, మాదిగ రాష్ట్ర నాయకులు ప్రకటించడం సంతోషించదగ్గ విషయమైన్నారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వం చేపట్టబోయే ఉద్యోగాల్లోనే కాకుండా మిగతా అన్ని విషయాల్లోనూ ఎస్‌సి వర్గీకరణ ఆర్డినెన్స్ ప్రకారం ఎంతో ఉపయోగకరంగా షెడ్యూల్ కులాలకు ఉంటుందని అన్నారు. ఈ విషయమై ఎస్సీల తరపున తాను శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించిన విషయం నియోజకవర్గ ప్రజలకు తెలుసునని అన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో, ట్రాక్టర్ ఢీ.. 8 మందికి గాయాలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ట్రాక్టర్, ఆటో ఢీకొన్న సంఘటనలో 8మందికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం రంగంపేటకు చెందిన యాళ్ల అప్పల నరసమ్మ, యాళ్ల సింహాచలమ్మ, గోర్జ జయమ్మ, బొంగు సరస్వతి, పెంట గౌరమ్మ, పొట్నూరు పైడితల్లి, వంగపండు సత్యవతి చినబోగిలిలో గల గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు ఆటోలో వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా కాశీపేటకు చెందిన నక్క భార్గవి కూడా చినబోగిలిలో అదే ఆటో ఎక్కింది. ఏగొట్టవలస జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న ఆటో అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో బొబ్బిలి ప్రభుత్వ హాస్పిటలకు వైద్యం నిమిత్తం తరలిచారు. భార్గవికి తీవ్ర గాయాలు తగిలాయి. ఈ సంఘటనపై సీతానగరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి - కురుపాం

ముందస్తు సమాచారం మేరకు సారా తయారీ కేంద్రాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయను మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం చినమేరంగిలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 40 లీటర్ల నాటు సారా స్వాధీనపర్చుకొని మీసాల రోజా, మీసాల కుమారి, బొమ్మల రాణి, మీసాల విజయపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సారా తయారీకి ముడి సరుకులు అందజేస్తున్న గెంబలి తిరుమలరావు, సూరి శ్రీధర్‌పై కేసు నమోదు చేసి త్వరలో అరెస్టు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిఐఎఫ్ సిఐ వివిఎస్ శేఖర్‌బాబు, ఎస్ఐ జె.రాజశేఖర్ పాల్గొన్నారు.

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ గ్రామ సమీపంలో గురువారం ద్విచక్ర వాహనం గోతిలో పడి ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మక్కువ నుంచి పాలకొండ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వండవ గ్రామ సమీపనికి వచ్చేసరికి రహదారి గోతులు మాయంగా ఉండటం వల్ల గమనించక గోతిలో పడిపోవడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పాలకొండ నుండి వస్తున్న జలుమూరు అమర్నాథ్ అనే వ్యక్తి గాయపడిన వీరిద్దరిని వీరఘట్టంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం కారులో తరలించారు.

ఫెయిల్ అయ్యామని అధైర్య పడొద్దు

ప్రజాశక్తి - పాచిపెంట

పరీక్షల్లో ఫెయిల్ అయ్యామన్ని విద్యార్థులు అధైర్య పడొద్దని సర్వశిక్ష ఎపిసి ఆర్. తేజేశ్వరరావు, జిసిడిఒ మధు విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో 10వ తరగతి విద్యార్థినులకు సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల కెవిబివి పదో తరగతి విద్యార్థినులు, వారి యొక్క తల్లిదండ్రులకు కేరీర్, మెంటల్ హెల్త్ గురించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష పోయినంత మాత్రాన జీవితం లేదనుకోవడం, ఆత్మహత్యలకు పాల్పడకుండా విద్యార్థినులకు మనోధై ర్యంగా ఉండాలన్నారు. ఇంకా వారికి ఉన్న అవకాశాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఇందు కోసం జిల్లా కోఆర్డినేటర్లు బి.సురేష్, జి.గౌరి ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక కెజిబివి ప్రత్యేకాధికారి షేక్ నజియా, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

24న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి పాలకొండ

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న పార్వతీపురం మనం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జరగనుందని, ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులంతా పెద్దఎత్తున పాల్గొనాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరరావు, ఆర్.రాము పిలుపునిచ్చారు. గురువారం పాలకొండలోజరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము మాట్లాడుతూ గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసిందని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దిస్తామని పవన్ కళ్యాణ్, చంద్రబాబులు పత్రికా విలేకర్లు సాక్షిగా హామీ ఇచ్చి తమ ఎన్నికల మ్యానిఫెస్ట్ లో కూడా పొందుపర్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీల అమలుకు కూటమి ప్రభుత్వం పూనుకోలేదని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందన్నారు. కావున అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం,లక్ష్మణరావు, పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా .. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన సంఘట మండలంలోని గురువునాయుడుపేటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాతుమూరుకు చెందిన మరిపెట్ల ఈశ్వరరావు (47) ట్రాక్టర్ మరమ్మతు కోసం బొబ్బిలి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా గురువునాయుడుపేట వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఈశ్వరరావు తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వరరావు భార్య సింహాచలం ఫిర్యాదు మేరకు స్థానిక హెచ్‌సి కృపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

పాలకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, మొబైల్ పార్టీ సిఐ, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది,శ్రీకాకుళం ఈఎస్టిఎఫ్ సిబ్బందితో కలిసి, పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ ఎఎస్ దొర ఆధ్వర్యంలో భామిని మండలం లో కొత్తగూడలో దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. నాటు సారాయి తయారు చేస్తున్న బిడ్డిక రవి, బిడ్డిక కొండల రావును అరెస్టు చేసి వారి నుండి 40 లీటర్లు నాటు సారాయిని స్వాధీనం చేసుకొని, నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లం పులుపులు 1000 లీటర్లు ధ్వంసం చేశారు. బెల్లం సరఫరా చేసిన భామిని మండలం గల ఘనసరకు చెందిన బెల్లపు వ్యాపారి భూపతి షణ్ముఖపై కేసు నమోదు చేశారు.నాటు సారాయి తయారుచేసిన మరియు అమ్మిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దొర తెలిపారు.